నొప్పినీ, దుఃఖాన్నీ భరించగలుగుతుంది. ఒక విషయంమీద మనసును కేంద్రీకరించడం, నిర్ణయం తీసుకోవడం లాటివి సులువుగా చేయగలుగుతారు. మనసు ఎప్పుడూ ఆటుపోట్లకు గురి కాకుండా ప్రశాంతంగా ఉండగలుగుతుంది. ఇది సాధ్యమైన తర్వాత కష్టాలు, చికాకులు మిమ్మల్ని బాధపెట్టవు. అవిధమైన మానసిక స్థైర్యం సాధించిన మీరు మీ మాటల ద్వారా, ప్రవర్తన ద్వారా, చేతల ద్వారా ఇతరులలో ఆత్మవిశ్వాసం కల్గించగలుగుతారు! ఆసనాల వలన ఆధ్యాత్మిక లాభాలూ ఉన్నాయి. రాజయోగంలోని అష్టాంగ మార్గంలో 'ఆసనాలు' మూడవ మెట్టు. వీటిద్వారా 'ప్రత్యాహారం' [ఇంద్రియాలను అధిగమించడం] 'ధారణ' [ఏకాగ్రత] 'సమాధి' [అతీతానంద స్థితి] సాధ్యమవుతుంది. హఠయోగం శరీరాన్ని ఆసనాల ద్వారా శుభ్రపరచి ఉన్నతమైన ఆధ్యాత్మిక సోపానాల నధిరోహించమని చెబుతుంది. వీటి గురించిన వివరాలు 'హఠయోగ ప్రదీపిక', 'ఘెరాండ సంహిత'లలో ఉన్నాయి.

ఆసనాలకు ఆధ్యాత్మిక లక్ష్యం లేదు అని కొందరు అంటుంటారు. అది తప్పు. యోగాసనాలను తంత్ర శాస్త్రంలో చెప్పిన విధంగా, వాటికి సంబంధించిన మనశ్శక్తి కేంద్రాలను స్మరిస్తూ చేయాలి. చాల యోగ పుస్తకాలు, యోగాచార్యులు ఈ విషయం తెలియక సరిగా చెప్పడంలేదు.

## నేటి మానవుడు

నేటి మానవుడికి చాల సౌకర్యాలున్నాయి. చక్కటి ఆఫీసులో పని చేస్తాడు. కారులో వెళ్తాడు. మెత్తటి పరుపులమీద పడుకుంటాడు. వినోదానికై సినిమాలకు, నైట్ క్లబ్‌లకు వెళ్తాడు. కాని శాంతికోసం, నిద్రకోసం మాత్రలు వేసుకుంటాడు. అయినా శాంతి ఉండదు. విశ్రాంతి దొరకదు. సుఖం మృగ్యం. ఆందోళన ఒత్తిడి నెత్తిమీద నాట్యం చేస్తుంటాయి. మరి అలాటి వాటికి పరిష్కార మార్గం ఉందా?

ఉంది! యోగ పద్ధతి అతడి సమస్య లన్నిటిని పరిష్కరిస్తుంది. యోగాసనాల ద్వారా ఆధునికత తెచ్చే మలబద్ధకం, కీళ్ళ నొప్పులు, కండరాల బాధలు, నిస్పృహ, ఒత్తిడి లాటి అవలక్షణా లన్నిటినీ దూరంగా తరిమేయవచ్చును. ఆసనాల ద్వారా చేకూరే శక్తితో, బలంతో అన్ని బాధ్యతలను, బరువులను చిరునవ్వుతో మోయవచ్చును. ఎన్నో సౌకర్యాలున్న ఈ ఆధునిక యుగంలో నేటి మానవుడు బలహీనుడై ఆ సౌకర్యాలను ఆనందించలేక జీవచ్ఛవమై బతుకుతున్నాడు. బాల్యంలోని సౌఖ్య స్మృతులను నెమరువేసుకుంటూ విషాద మనస్కుడై ఈసురోమని 'బండి' లాగుతుంటాడు. ఈ 'నిర్జీవన' ఛేదాన్ని ఛేదించి ఆసనాలు పునరుజ్జీవనం ప్రసాదిస్తాయి. జీవితం ఆనందమయం అయి, ఓపిక పెరిగితే ఇతరుల సమస్యల పట్ల అవగాహన ఏర్పడుతుంది. అప్పుడు సర్వమానవ సౌభ్రాతృత్వం అంటే ఏమిటో తెలిసివస్తుంది.

రచయితలు, కళాకారులు, మేధావులు, ఉపాధ్యాయులు లాటి మానసిక శ్రామికులకు యోగాసనాలు ఆలోచనాశక్తిని పెంచుతాయి; స్పష్టమైన దృష్టి నిస్తాయి.

ఎల్.ఎస్.డి., డ్రగ్స్ లాటి మాదకద్రవ్యాలకు బానిసలయిన వారికి యోగాసనాలు కొత్త జీవితాన్నిస్తాయి. ఆనందానికి కొత్త అర్థం చెబుతాయి. అన్ని ఆనందాలకు మించిన ఆనందం ఏమిటో రుచి చూపిస్తాయి.

[వచ్చే వారం: 'ఆసనాల భంగిమలు; ముందు జాగ్రత్తలు]

# పందెం

## చిలుకూరి దేవపుత్ర

బస్టాండులో నుంచి అప్పుడే బస్సు బయలుదేరుతోంది.

నేను పరుగులు తీసి అందుకుని సీటులో కూలబడ్డాక 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాను. మా ఆవిడ వంట పుణ్యమా అని ఇవ్వాళ ఇంతాలస్యం అయింది. టైము చూసుకున్నాను. పదిన్నర కావస్తోంది. మరో అరగంటకి కానీ నేను ఉద్యోగం వెలగబెడుతోన్న ఊరు రాదు. ఆఫీసుకు లేటుగా వచ్చినందుకు మా ఆఫీసరుగారు చూడబోయే వేడి వేడి చూపులూ, వాడబోయే వాడి వాడి మాటలూ జ్ఞాపకం వచ్చి వెన్నులో నన్నొని వణుకు ప్రారంభమయింది.

భూమి బల్లపరువుగా ఉందని ఎవరైనా చెబితే నమ్ముతాను.

అర్ధరాత్రి వేళ ఒక ఆడది ఒంటరిగా ఎక్కడికయినా తిరిగి రాగల కాలం వచ్చింది అని ఎవరు చెప్పినా నమ్మేస్తాను.

భారతదేశంలో ఈవాళ్టినుంచీ కులాలూ, మతాలు పోయి అందరూ ఒక్కటయిపోయారు అని మానవమాత్రుడు ఎవరు చెప్పినా సరే నమ్మేయడమే!

పులులూ, సింహాలూ ఇకనుండీ శాకాహారులుగా మారాయట అని మాట మాత్రంగా చెప్పినా నమ్మేస్తాను!

అయితే-

మా ఆఫీసరు నవ్వేడంటే మాత్రం నేను ఛస్తే నమ్మను గాక నమ్మను. నేను కాదు కదా తలలో మెదడనే పదార్థం ఉన్నవాడెవడూ నమ్మడు.

అవును.

మా ఆఫీసరుకు 'నవ్వు' అంటే ఏమిటో తెలీదు. అసలు 'నవ్వు'కు స్పెల్లింగు తెలుసో, లేదో నాకు మాత్రం తెలీదు. మా ఆఫీసరుకు సొంత నిఘంటూ ఓ నిఘంటువు లేదు కానీ, ఉండుంటే 'నవ్వు' అన్న పదం ఉండి ఉండదు!

నవ్వడం రాదు అంటే ఆయనకి చాలా విషయాలు రావు అని అనుకుంటే పొరపాటే! ఆయనకి కళ్ళతో చుర చుర చూడటం వచ్చు, మొహం మల మల మాడ్చుకోవడం వచ్చు, పళ్ళు పట పట కొరకడం వచ్చు. ఎదుటి మనిషి హడలి చచ్చేలా గట్టిగా బొబ్బలు పెడుతూ అరవడం వచ్చు. ఇలా ఇంకా అనేకానేకం వచ్చు.

బ్రహ్మదేవుడు సరస్వతీదేవితో దెబ్బలాడి విసుగ్గా కోపంగా ఉన్నప్పుడు మట్టితో చేయడానికి బదులూ తారునీ, కాటుకనీ ముద్దగా పిసికి మా ఆఫీసర్ని చేసి ఉంటాడు. అందుకే ఆయన అంత నలుపూ, మొహంలో అంత విసుగూ.

బస్సు ఆగింది - దిగాను.

అర్ధగంట ఆలస్యానికి ఆఫీసరుగారి కేకల్నీ ఆయన మొహాన్నీ ఊహించుకుని; కదులుతోన్న బస్సు కింద తల పెడదామా అని ఆలోచించాను. మా ఆవిడ పసుపు కుంకుమలూ, మా పిల్లల "నాన్నా" పిలుపులు నన్ను అసమర్థుణ్ణి చేశాయి!

బస్టాండు నుంచి ఫర్లాంగు దూరంలో ఉంది మా ఆఫీసు. వేగంగా నడక సాగించాను.

ఆఫీసు దగ్గరవుతోన్న కొద్దీ గుండెలోని గుబులూ, వెన్నులోని వణుకూ మరీ ఎక్కువవుతున్నాయి.

నేనేం దొంగతనం చేశానా? ఎవర్నయినా ఖూనీ చేశానా? ఎవడి పెళ్ళాన్నయినా లేవదీసుకెళ్ళానా? ఆఫీసరుకి ఎందుకు భయపడా లసలు? భయపడను - కానీలే - ఏం చేస్తాడూ? 'మెమో' ఇస్తాడా - ఇవనీ, కేకలేస్తాడా - వెయ్యనీ - "మీ కేకలు కట్టిపెట్టండి సార్! నేను పని చేయకపోతే కేకలెయ్యండి - ఎప్పుడో ఓసారి అర్ధగంట ఆలస్యంగా వచ్చినందుకు కేకలు వేస్తున్నారంటే అందుకు మీరు సిగ్గుపడాలి! మీ రిలాగే కేకలు వేస్తుంటే ఇక రోజూ గంట ఆలస్యంగా వస్తాను - ఏం చేస్తారో అదీ చూస్తాను" - అంటూ సీరియస్‌గా వీరావేశంతో నిలదీసి అడిగేయాలని నిర్ణయించుకున్నా.

ఆఫీసు రానే వచ్చింది - లోపలికి అడుగు పెట్టబోతుంటే నాలో ఇందాకటి వీరావేశం అంతా మటుమాయం!

అటెండరు నాగప్ప నవ్వి - "నమస్తే సార్!" అన్నాడు. నాకు ఒళ్ళు మండింది.

వీడి బోడి నవ్వూ వీడూను - నన్ను ఆఫీసరు తిట్టబోయే తిట్లను ఊహించుకుని నవ్వుతుంటాడు వెధవ!

ఆఫీసంతా బోసిగా ఉంది.

ఖాళీ కుర్చీలకు కాపలా కాస్తున్నట్టు ఎదురుగా: గోడవారగా హెడ్ క్లర్కు కూచుని ఉన్నాడు.

"గుడ్ మాణింగ్ సార్!" అన్నాను.

"ఆఁ గుడ్ మార్నింగే... బస్ లేటా?" అన్నాడు.

పళ్ళికిలించి 'అవు'నన్నాను. మా ఆఫీసుకి పెద్ద మైనస్ పాయింటు మా ఆఫీసరయితే, మా హెడ్ క్లర్కు పెద్ద ప్లస్ పాయింటు. ఆఫీసులో ఏ విషయం పట్టించుకోడు - ఎవర్నీ దండించడు.

"ఏం సార్! అందరూ మూకుమ్మడి సెలవా?" అన్నాను - ఆఫీసునంతా ఓసారి కలయచూస్తూ.

"అబ్బే లేదయ్యా! ఈ రోజు మన ఆఫీసరు సెలవు పెట్టాడు గదా! అందువల్ల స్టాఫంతా మహా సంతోషంతో కాంటీన్‌లో కాఫీ తాగడానికని వెళ్ళారు. నాకు ఇక్కడికే కాఫీ పంపుతా మన్నారు. నువ్వూ వెళ్ళి రా... తొందరగా. నాకు స్ట్రాంగ్ కాఫీ పంపమని చెప్పు..." అన్నాడు హెడ్ గుమాస్తా.

"యా... హూఁ!" అని ఎగిరి గంతేయా



లనిపించింది. మా అటెండరు గమనించి ఆఫీసరు దగ్గర పుల్ల లెక్కిస్తాడేమోనని భయం వేసి మానుకున్నాను.

అటెండెన్సు రిజిష్టర్లో సంతకం చేసి - కాంటీన్ చేరుకున్నాను.

ఓ టేబుల్ చుట్టూ రౌండు టేబుల్ సమావేశంలా కూచుని ఉన్నారు మా వాళ్ళు.

"అందరికీ వందనాలు" అన్నాను నవ్వుతూ.

"రండ్రండి" అంటూ ఓ సీటు చూపించారు.

"ఓ కాఫీ - మా రాజుగారికి" అంటూ శివరావు కేకవేశారు.

"మేము పందెం వేసుకున్నాం రాజూ!" అన్నాడు శివరావు.

"నువ్వూ పందెంలో పాల్గొనాలి" కృష్ణమూర్తి.

"పందె మేమిటో తెలియందే" అన్నాను అయోమయంగా వాళ్ళ మొహాల్లోకి చూస్తూ.

అంతలో కాఫీ వచ్చింది. ఓ సిప్ చేసి చెప్పండి అన్నాను నవ్వుతూ.

శివరావు చెప్పడం మొదలుపెట్టాడు.

"మన ఆఫీసరు గారి నవ్వు మీద పందెం. ఆయన్ని ఎవరైతే నవ్విస్తారో వారికి స్టాఫు తరపున నూటపదహార్లు ఇచ్చుకుని డిస్నీ బార్‌లో గొప్ప బీరు పార్టీ ఇస్తాము. ఇదీ పందెం! ఒక్కొక్కళ్ళకి మూడు ఛాన్సులు ఉంటాయి. ఆ మూడు ఛాన్సుల్నీ పోగొట్టుకుంటే అతను - అంటే ఓడిపోయిన మనిషి అన్నమాట - స్టాఫ్ కంతటికీ అదే డిస్నీబార్‌లో బీరు పార్టీ ఇవ్వాలి. మీరు పాల్గొంటారా?"

"క్షమించి నన్ను వదిలేయండి. అర్భకుడిని. మొత్తానికి మంచిపందెమే! ఆయన్ని నవ్వించడం అంటే తివిరి ఇసుమున తైలము తియ్యడం వంటిదే! ఎవరైనా ముందుకు వచ్చారా?" అన్నాను.

"వచ్చాడు ఒకే ఒక వ్యక్తి. 'ది గ్రేట్ శేషగిరిరావు' ముందు కొచ్చాడు. తక్కిన మే మంతా చేతకాని వాళ్ళ మని ఒప్పేసుకున్నాం" అన్నాడు కృష్ణమూర్తి.

నవ్వుతూ గర్వంగా చూశాడు శేషగిరిరావు.

"బెస్ట్ ఆఫ్ లక్! గొప్ప సాహసమే! గో ఎహెడ్!" అన్నాను.

"అది సాహస మని ఎందు కనుకుంటున్నారు?" అన్నాడు శేషగిరిరావు.

"సింహాన్ని నవ్వించడం సాహసం కాక మ రేమవుతుంది" అన్నాను.

"మనిషి తలుచుకుంటే చేయలేనిది ఏముంది? ఒక వారంలోగా ఆఫీసర్‌ని నవ్విస్తా!" అంటూ పైకి లేచి కాల రెగరేసి హొటల్ నుంచి బయటికి నడిచాడు. మేమంత అతన్ని అనుసరించాం.

** ** **

'ఈ రోజు 'స్టాఫ్ మీటింగు' ఉంది కదూ! ఆఫీసర్ని నవ్వించేస్తాను చూస్తూ ఉండండి!" అన్నాడు శేషగిరిరావు ఆ మరునాడు ఆఫీసుకు వస్తూనే. మొత్తానికి శేషగిరిరావు అసాధ్యుడే అనిపించింది.

పదకొండింటి కల్లా స్టాఫ్ మీటింగు మొదలయింది.

తన సహజమైన మాడు మొహంతో కనుబొమల్ని ముడిచి చాలా సీరియస్‌గా మమ్మల్నందర్నీనీ చూస్తున్నాడు మా బాసు.

"ఏడీ! ఆ శేషగిరిరావు ఏడయ్యా! స్టాఫ్ మీటింగు పదకొండు గంటలకంటే ఇంకా రాలేదేం? స్టాఫ్‌లో డిసిప్లీన్ లేదు, పంక్చుయాలిటీ లేదూ, పాడూ లేదూ! ఎప్పుడు నేర్చుకుంటారు? అంత యూజ్‌లెస్ ఫెలోస్‌ని వేశారు నాకు. ఈ ఉద్యోగమే దొరక్కపోయుంటే బస్టాండులో బఠాణీలు అమ్ముకోడానికి కూడా పనికిరారు." అంటూ తన సొంత బాణీలో గొణగడం ప్రారంభించాడు బాసు. అక్కడితో ఊరుకోక కసికసిగా కాలింగ్ బెల్ నొక్కాడు. అది 'కర్‌ర్‌ర్' మంటూ మోగింది. ప్యూన్ వచ్చాడు.

"ఏమి టా దేబి మొహం వేసుకుని చూస్తావ్ దరిద్రపు వెధవా! ఆ శేషగిరిని పిలువ్! ఊఁ. తొందరగా" అన్నాడు.

కొత్త ప్యూన్ అయితే తనని ఎందు కలా తిడుతున్నాడో తెలియక తికమకపడేవాడే!

"వచ్చేస్తున్నా సార్!" అంటూనే నవ్వుతూ లోపలికి వచ్చాడు శేషగిరి రావు. తప్పకుండా అతని గుండెకు రోమాలు వచ్చుంటా యని నా అనుమానం.

మా బాస్ చురచుర చూశాడు అతనివైపు.

ఆ 'చుర చుర' నేమీ లెక్కచేయకుండా "మీ కో శుభవార్త సార్! ప్రమోషన్ రాబోతోంది మీకు!" అన్నాడు సీటులో కూర్చుంటూ.

'అమ్మ దొంగా! పందెం గెలిచేస్తా వన్న మాట!' అనుకున్నాను నేను.

"ఎవరు చెప్పారు?" అన్నాడు మా బాస్. ఆయన మొహంలో రవ్వంతయినా మార్పు రాలేదు.

"మన హెడ్డాఫీసులో ఎ త్రీ గుమాస్తా గోపాల్ చెప్పాడు సార్!"

"ఎప్పుడో రావాల్సిన ప్రమోషను ఇన్నాళ్ళకి వస్తోందయితే!" అనుకున్నాడు స్వగతంగా.

మే మంత "కంగ్రాట్యులేషన్స్ సార్!" అన్నాం కోరస్‌గా.

"ఆఁ ఎం కంగ్రాట్యులేషన్స్, థాంక్సే లెండి! అనమర్థులందరికీ ఎప్పుడో ప్రమోషన్లు ఇచ్చారు. ఇక ఎవరూ దొరక్క నా కిచ్చి ఉంటారు వెధవలు! దొంగ ముండాకొడుకులండీ మన డిపార్ట్‌మెంటులో ఉండేది. సరేలే! ఈ నెలలో శేషగిరిరావు, శివరావు, రాజశేఖర్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యాంలు తమ పిఆర్‌లు [పర్సనల్ రిజిస్టర్లు] ఇంకా పెట్టలేదు. మన హెడ్ క్లర్క్ గారు ఏం చేస్తున్నట్టు? ఏమండీ హెడ్ క్లర్క్ గారూ! ఆఫీసులో గోళ్ళు గిల్లుకుంటూ కూచున్నారా? ఈ నెల ఆరో తారీఖునే పెట్టాల్సిన 'పిఆర్'లు పెట్టలే దంటే ఏం చేస్తాడులే ఈ ఆఫీసరుగాడు అనుకున్నారా! ఐ విల్ ఇష్యూ ఎ చార్జి మెమో. రేపు ఉదయం పదిన్నరకల్లా మీ పిఆర్‌లు హెడ్‌గుమాస్తా వద్ద సంతకాలై నా టేబులు మీదకి రావాలి" అంటూ సీరియస్‌గా ఆఫీసు విషయాల్లోకి దిగిపోయాడు మా బాసు.

> **వాయి దాలారమ్!**
>
> "అయ్యా! వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసే ఈ కారులో మీ నెలసరి వాయిదా చెల్లింపు తేది ముందు రోజున హెచ్చరికగా గంటకోసారి, అలారమ్ మ్రోగే ఏర్పాటుందండీ!" అని సవినయంగా వివరించాడు సేల్సు మనిషి!

"ఏమైనా సరే, ఈ రోజు నవ్వించేస్తాను" దృఢంగా అన్నా డో రోజున హఠాత్తుగా మా శేషగిరిరావు.

"మీ రిక్కడే చెవులు రిక్కించి వింటూ ఉండండి" అంటూనే ఆఫీసరు గారి గదిలోకి దూరాడు.

మే మంత పనులు మానుకుని స్ప్రింగ్ డోర్ వద్ద మకాం వేశాం.

లోపల్నుంచి సంభాషణ వినపడుతోంది.

"ఈ రోజు రిజల్ట్స్ వచ్చాయిగద సార్!"

"ఎవిరివీ?"

"మీ అమ్మాయి గారివి సార్! ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు అమ్మాయి గారు. చాలా సంతోషం సార్! నిజంగా మీ తెలివి తేటలే సార్ అమ్మాయి గారివి."

"చాల్చాలు లేవయ్యా! నా తెలివి తేటలు అంటావ్! నేను స్కూలు ఫైనల్లో ఫస్టు రాంకులో పాసయ్యా తెలుసా? అది ఆడపిల్ల. ఫస్ట్ రాంక్ తెచ్చుకుంటుం దనుకుంటే అఫ్టాల్ ఫస్ట్ క్లాసులో పాసయ్యింది. దానికి వాళ్ళమ్మ తెలివి తేటలు అబ్బాయి. పొరపాటున మా ఇంటి కెళ్ళి దానికి కంగ్రాట్స్ చెప్పేవు - అది ఉబ్బిపోయి ఇక చదువుకోవడం మానేస్తుంది" అంటూ కరుకు కంఠంతో వినిపిస్తోంది.

ఇదంత వింటూ మేం ఒకటే నవ్వుకున్నాం.

అయిదు నిమిషాల తర్వాత గదిలోంచి బయటికి వచ్చిన మా శేషగిరిరావు మొహం చూస్తే ఎవరికైనా వైరాగ్యం పుట్టుకొచ్చేలా ఉంది.

"నాయనా శేషగిరిరావు! ఎందు కొచ్చిన పందెం చెప్పు! ను వ్వెలాగూ ఓడిపోక తప్పదు. మాకు బీరు పార్టీ ఇవ్వకున్నా టీ పార్టీ అయినా ఇస్తే ఆనందిస్తాం" అంటూ మధ్యాహ్నం కాంటీన్‌లో మా కృష్ణమూర్తి ఉడికించాడు.

"ఇంకా మనకి ఒక ఛాన్సు ఉంది గురూ! చూస్తూండండి! గెలిచి తీరుతాను" అంటూ మొక్కవోని ధీమాతో రోషంగా సిగరెట్టు వెలిగించి కసి కసిగా పీల్చి మళ్ళీ చెప్పసాగాడు - "నా పథకం ఈ సారి ఫెయిల్యూర్ అవదు. రేపు రాత్రి ఎనిమిది గంటలకి మీరు 'డిస్నీ బార్' వద్ద రెడీగా ఉండండి. నేను ఏకంగా అక్కడికే వస్తాను."

"అ దెలా? నువ్వు గెలవందే?" అన్నాను.

"నేను గెలుస్తాను రాజూ! ఆయన నవ్వుని నేను టేప్ చేసుకొచ్చి మరీ వినిపిస్తాను."

"ఎవరితోనైనా మిమిక్రీ చేయిస్తావా?" అన్నాడు కృష్ణమూర్తి.

"నో సార్! ఈ శేషగిరిరావుకి అంత కర్మ పట్టలేదు. నేను నిజాయితీగా వ్యవహరిస్తాను. మీరు నమ్మాలి. నా ప్లాన్ సక్సెస్ అయితీరాలి" అన్నాడు శేషగిరిరావు వెరీ సీరియస్‌గా.

అతని నిజాయితీని శంకించినందుకు కృష్ణమూర్తి మీద నాకు కోపం వచ్చింది.

** ** **

రాత్రి ఎనిమిదిన్నర అయింది.

ఊరి బయట ఉంది డిస్నీ బారు.

మే మంత డిస్నీ బార్ ముం దున్న చెట్టు కింద ఉన్నాం.

శేషగిరిరావు గెలుస్తా డన్న నమ్మకం మా వాళ్ళలో వీసమెత్తయినా లేదు. అతను రాకపోతే ఏమి చేయాలా? అని ఆలోచిస్తున్నాం.

దూరంగా మోపెడ్ వస్తున్న శబ్దం.

మోపెడ్‌కు ఉన్న హెడ్ లైటు గుడ్డి వెలుతుర్ని బట్టి అది శేషగిరిరావు మోపెడే నని కనిపెట్టాం.

మోపెడ్ దగ్గరి కొచ్చింది.

"సక్సెస్!" అంటూ అరిచాడు శేషగిరిరావు మోపెడ్‌కి స్టాండు వేస్తూ.

ఉలిక్కిపడ్డామే కానీ ఏమీ మాట్లాడలేకపోయాం.

అతని చేతిలో చిన్న టేపు రికార్డరుంది.

"నిజంగా!" అన్నాను కాసేపటికి.

"అనుమానమా?" అంటూ టేప్ రికార్డర్ ఆన్ చేశాడు.

మే మంత అక్కడే నిలబడి వినడానికి సిద్ధమయ్యాం.

అస్పష్టంగా ఏవేవో డ్రామా డైలాగులూ, వింత వింత ధ్వనులూ, కృత్రిమమైన శబ్దాలూ వినబడుతున్నాయి. ఉన్నట్టుండి ఈహిహ్హీ! ఆహహ్హా! ఓహొహ్హో! అమ్మో! ఏం నవ్వో? ఏందయ్యా! అహ్హా హ్హా... మిస్టర్ శేషగిరిరావ్! భలే నవ్వు ... హహ్హాహ్హా! ఏం నీకు నవ్వు రావట్లేదా? అలా వెర్రి మొగమేసి పళ్ళికిలిస్తావ్!" అంటూ సీరియస్‌గా మందలించి మళ్ళీ దొంతరలుగా నవ్వు. అది నిజంగా మా ఆఫీసర్ నవ్వే!

అందరం అతనితో చేయి కలిపాం.

"అమ్మో! అసాధ్యుడివే! ఎలా సాధించావ్?" అన్నాను.

"ఎలా అంటే, నేను రెండు ప్రయత్నాలు చేశాను. దాంతో ఆయన మనస్తత్వం అర్థం చేసుకున్నాను. ఈ మనిషి అందరిలా సంతోషపడేవాటికీ, నవ్వేవాటికీ చలించడు అని గ్రహించాను. ఇలాంటి ఘటాన్ని నవ్వించాలంటే చాలా కృత్రిమమైన విషయాలు నవ్విస్తా యనే నిర్ణయాని కొచ్చాను."

"అంటే లాఫింగ్ గ్యాస్‌ను వాసన చూపించావా?" అన్నాడు కృష్ణమూర్తి.

"పొండి గురూ! మీరు మరీనూ! మా ఇంటికి ఇవాళ రాత్రి విందుకు ఆహ్వానించాను" అంటూ సిగరెట్టు అంటించుకున్నాడు.

"ఆహ్వానించీ ...." అసహనంగా సస్పెన్సు ఆగలేక అడిగాడు శివరావు.

"విందుకు ముందు మా టీ.వీ. చూపించాను."

"అంటే?"

"సరిగ్గా ఆ సమయంలో టీవీలో తెలుగు సీరియల్ వస్తోంది. దాన్ని చూసి నవ్వాడు." అంటూ ముగించి బార్‌వైపు దారి తీశాడు. మోపెడ్‌ను తోసుకుంటూ. ★